ఏ.జి.హేమలత

# భావ్యసేన మిత్ర




'అమ్మా! నన్ను వేధించకమ్మా! నేనాపిల్లను చేసుకోను' అన్నాడు నాగరాజు విసుగ్గా మొహం పెట్టి.

'ఎందుకో చెప్పకుండా, ఏమిట్రా ఆ కోప తాపాలు? నాకంటె ఎక్కువ తెలుసా నీకు?' అంది, అమ్మ గొంతులో అధికారం మిళాయించి.

'అదికాదమ్మా! ఎందుకో నేను చెప్పలేక పోతూన్నాను _ నేనా

అమ్మాయిని చేసుకోలేనమ్మా! అంతే' అన్నాడు మాట తుంచేసి.

'బాబూ – నాగులూ – నామాట ఏనాడూ కాదనలేదు నువ్వు! అది కాదురా, ఆ పిల్లకేం లోటు చెప్పు – పిల్ల పుత్తడిబొమ్మలా వుంది – పెదవులమీద చిరునవ్వుతో సాదరంగా మాటాడే స్వభావం – మీనాన్నగారు కట్నమంటే కన్నుమన్నాగే గాని కనీసం పదివేలకు పైనే ముట్ట చెప్పేవారు – అది అలావుంచు – నెలకు నాలుగొందలు సంపాదిస్తున్నది....

'అమ్మా .... అమ్మ మనకదేనా ప్రధానం?' అన్నాడు పళ్ళుబిగిస్తూ.

'చూడు, నాయనా, యు.డి.సి. చేస్తూన్న – రెండోరెక్క ఆడక పోవడంతో ఆ పుట్టిన యిద్దరి పిల్లల తోనే జీవితరథం సాఫీగా లాగించ లేకపోతూన్నాడు....

అక్క....చూడునాయినాబావతో పాటు రెక్కవిరుస్తోందిగనక మూడు పువ్వులు ఆరుకాయలుగా దొర్లిపో తోంది వాళ్ళజీవితం.

అది అలావుంచు –

ఆ రోజుల్లో మేమిద్దరం బడిపంతు ళ్ళుగా కష్టపడ్డాం కాబట్టి పెద్దలు సంపాదించి యిచ్చిన ఎర్రని ఏగాని లేకపోయినా మిమ్మల్ని చదివించి యింతవరకూ చేశాం....

నువ్వు నామాట పాటిస్తావా సరే సరి – లేదా నువ్వు మరోచోట మన సిచ్చివుంటే చెప్పు – ఏదో నన్ను మభ్యపెట్టి, నిన్ను నువ్వు మోస గించుకోకు నాయనా! ఇది జీవితం వెయ్యేళ్ళ పంట–బాగా ఆలోచించు.

అంటూ ముగించింది – యిక చెప్పేందుకు ఏమీ లేదన్నట్టు.

'అమ్మా! నాన్నగారు కన్ను మూస్తూ ఆఖరిసారిగా ఆ అమ్మా యిని చేసుకోమనే చెప్పారు–

అమ్మా! నన్ను అపార్థం చేసుకో కమ్మా – కంటికి రెప్పలా చూచు కొనే కన్నతల్లివి నువ్వు! నేపూజించు కొనే దేవతవు నువ్వు! నీమాట నే కాదనలేను – అలా అని ఈ పెళ్లికి అంగీకరించలేను'– అని నసుగుతూనే అన్యాయ్యఅనేశాడు.

'సరే నీయిష్టంవచ్చినట్టు చేసుకో' అని గబగబ చక్కాపోయింది వంటిం టోకి సుశీలమ్మ.

ఆమె వెళ్ళిన దిక్కేచూస్తూ–కణ తలు మునివేళ్ళతో నొక్కుతూ– గోడకి ఆనుకుని నుంచుండిపోయాడు నాగరాజు.

అమ్మ మనసు బాధపెట్టానేమో అనుకున్నాడు....తనలో తానే మూగగా ఆలోచించుకో సాగాడు.

'అమ్మకింక జీవితంలోమిగిలింది– యీ కోరిక ఒక్కటే – నేనొక యింటివాడ్నయితే చూడాలని–

ఆపైన దైవచింతనలో శేషజీవితం

గడపాలనీ - అయినా - అసలు కథ అమ్మతో చెబితే' అనుకున్నాడు.

అమ్మకు చెబితే - తేలిగ్గానవ్వేసి-

నాయినా! జీవిత నావ నడపాలంటే, పట్టుదలలు పనికిరావురా! మనిషిలో మంచిని ఎంచుతూ చెడును కలుపుమొక్కలా పక్కకు తొలగిస్తూ సాగిపోవాలిరా అంటుంది.

అమ్మ మనసు మంచిగంధంలాటిది - ఆ చల్లని గుండెను నొప్పించనా? అలా అని నా గుండెలో అణిగివున్న అగ్నిపర్వతాన్ని ఎలా ఆర్పడం - మనసుకి బలంగా తగిలిన గాయం మానుతుందా? ఆ అహంకారిని పెళ్లాడ్డం సాధ్యమా? ఇంటికి కళ తెచ్చేది యిల్లాలంటారే? కోటి వెలుగుల పంట యిల్లాలంటారే?

అయినా సుగుణ మాత్రం ఎలా ఒప్పుకుంది? సిగ్గు లేదూ? అనుకుని, మళ్ళీ ఆలోచించి—

'నా వూహ సరికాదేమో, వాళ్ల నాన్న, ఆ ముసిలాయన తన కూతురికి ఒక తోడు కావాలని- తనకి ఒక అండ కావాలని-హు- స్వార్థంతో నా గొంతు కోయా లనుకున్నాడు'.

అనుకుంటూ,

వూగిసలాడి పోయాడు, ఉక్రోషంతో....

'అమ్మ-మళ్ళీ అడిగితే! ఉద్యోగ మొచ్చిందిగా - మరి పెళ్ళి చేసుకోవుట్రా అని అడగనీ - యీసారి గట్టిగా చెబుతాను' అనుకున్నాడు.

* * *

ఆరోజునే ఫ్యాక్టరీలో సెక్యూరిటీ ఆఫీసరుగా చేరాడు. అమ్మ కాళ్ళను కళ్ళ కద్దుకొని, నాన్నగారి ఆశీస్సులు పొంది, ఒదినకు నమస్కరించి, అన్నయ్యతో కలిసి బయలు దేరాడు. టుబాకో కంపెనీ దగ్గర ఆగిపోయి అన్నయ్య 'తమ్ముడూ! అక్కడ సీతాపతి నీకోసరం ఎదురు చూస్తూ వుంటాడు.

నిన్ను నువ్వు పరిచయం చేసుకో- వాడందరికీ పరిచయం చేస్తాడు' అంటూ తన కంపెనీలోకి వెళ్ళిపోయాడు అన్నయ్య. నాగరాజు అల్లాగే చేశాడు.

ఫ్యాక్టరీ గేటుదగ్గర అతనికోసరం ఎదురు చూస్తూన్న స్నేహితుడు - సీతాపతి,

'హల్లో! మిస్టర్ నాగరాజూ'అంటూలోపలికినడిపించాడు. ఛార్జితీసుకోవలసిన ఆఫీసర్ దగ్గరకి తీసికెళ్లి జాయినింగ్ రిపోర్టు యిప్పించి ఒక్కో సెక్షన్ కి తీసికెళ్లి వారందర్ని పరిచయం చేశాడు నాగరాజుకి.

ఒక సెక్షన్ దగ్గర ఆగి 'ఇది స్టోర్స్ అండ్ పర్ చేసింగ్ సెక్షన్ - ఈయన భుజంగరావు పర్ చేజింగ్ ఆఫీసర్ - వారే ఫణిపతిగారు సేల్స్ ఆఫీసర్ - ఈ ఫ్యాక్టరీ రథానికి రెండు

చక్రిల్లాంటివారు - ఇందులో ఎవరు లేకపోయినా యీ రథం కుంటుపడుతుంది - ఫ్యాక్టరీ బాగుపడాలన్నా- బాధపడాలన్నా వారి చేతుల్లోనే వుంది' - అంటూంటే భుజంగం, ఫణి కాలర్లు సవరించుకున్నారు - గొప్ప కాంప్లిమెంట్లు కొట్టేశామన్నట్టు-

ఇంకా ముందుకు నడిచి-

ఇదుగో - ఈమె మిస్. సుగుణ- స్టోర్స్ ఆఫీసర్. చాలా చురుకుగా, అతినేర్పుగా, చాకచక్యంతో పని చేసుకునే అమ్మాయి. పాముపడగల నీడ సోకకుండా బ్రతుకుతోంది - ఓర్పుగా - నేర్పుగా-' అన్నాడు. చివరి మాటలు మెల్లగా - అంటూ- తేలిగ్గా నవ్వేశాడు.

మరి వుంటా- మళ్ళీ సాయింత్రం కలుస్తా.

అంటూ, సీతాపతి నిష్క్రమించాడు. సీతాపతిమాటలకు భుజంగం ఫణి ఒకరి మొహం ఒకరు, ఇద్దరు కలిసి సుగుణవైపు లొట్టలేసుకుంటూ చూశారు. ఇది గ్రహించిన సుగుణ మొహం చిట్లించి, తనపనిలో నిమగ్నమయింది.

బట్టబుర్ర భుజంగం- సరిగ్గా సర్దుకొని కూర్చున్నాడు సీట్లో....

ఆమెను మొదటిసారిగా చూసిన నాగరాజు.

భువినుండి దివికి దిగివచ్చిన దివ్యాంగనే అనుకున్నాడు. మెరిసిపోయే బంగారు మేనిఛాయ, బెదిరిపోయే సోగకళ్ళు, పగడల్లాంటి పెదవులు, అద్దాల్లాంటి చెక్కిళ్ళపై కనీ కనిపించని సొట్టలు, చిన్ని గడ్డం, నల్లటి నొక్కులజుత్తు-పాపిట వుందో లేదో అన్నట్టుగా దువ్వబడివదులుగా వేయబడిన జడ - అందులో ఒకేఒక విడీవిడని సింహాచల సంపెంగమొగ్గ- ఒంటిపై వెంకటగిరి నీలిరంగు చీర, నీలపు గాజులు, మెడలో ముత్యాల దండ అలంకరణ అతి సహజంగా సింపుల్ గా వుంది.

ఆమె నడుస్తూంటే మెరుపు మెరిసినట్టే వుంది. నాగరాజు మనసులో చెరగని ముద్రగా నిలిచిపోయింది - ఆమె రూపం.

• • •

కోనసీమలో ఒకపల్లె. అది సుగుణ బామ్మగారి వూరు. ఎండాకాలంలో స్కూలుకి శలవులిచ్చారంటే చాలు బామ్మగారి వూరు చేరుకునేది సుగుణ. వారింటిముందు కాయలు చేతికి అందేలా గెలలుదిగి వుండేవి కొబ్బరిచెట్లు. చెట్లనానుకుని కాలవగట్టు. ఆ గట్టుమీద జనం అద్దరి నుండి యిద్దరికి వస్తూంటే చూడ్డమన్నా, గాలివాటంలో తెరచాప సాయంతో సాగిపోయే పడవల్లో వల్లీయుల పదాలు వినడమన్నా సరదా. వాళ్ళ బామ్మని ఏడిపించుకు తినేది.




కాలవగట్టుమీద కూచుందాం - రమ్మని....

మరి చిన్నప్పుడయితే యింటి ముందరి ఎత్తు అరుగులమీద కూచో పెట్టి, బామ్మ ఆ కథ యీ ధ చెప్పి మరిపించేది....

ఆ తర్వాత, కొన్నేళ్ళకు బామ్మ- 'అల్లా కూచోకూడదే అమ్మా! అక్కడ రౌడీ ముండావాళ్లు- మొగ పిల్లలు తిరిగేదారి' అనేది..., తిరిగితే మనకేం బామ్మా- మనం అలా గట్టు మీద తిరిగివద్దామే అని మారాం చేసేది సుగుణ. ఏదో సుగుణకు అర్ధ మయ్యేలా చెబుదామనుకున్న బామ్మ 'అయ్యో తప్పురా - నా చిట్టి కానులూ' అని బుజ్జగిస్తూ మనవ రాలితో.

'తిరక్క మగాడు, తిరిగి ఆడది చెడ్డదంటారమ్మా' మా అమ్మవు కాదూ అనేది.... అంతేనా వాళ్లకేం అమ్మా - మగపిల్లలు - బహు గడు గ్గాయిలు - కన్నుకొడతారే అమ్మా వాళ్ళలా నువ్వు తిరగొచ్చా. నువ్వు ఆడపిల్లవు -

అసలు వాళ్ళజట్టుకే పోకూడ దమ్మా' అనేది...

'ఏవిటో - యీ బామ్మ' అంటూ కాళ్ళు దున్నుకుంటూ చేతులు వూపుకుంటూ, తల వూపుతూ గారంతో మారాం చేస్తూ....

ఫో - బామ్మా నువ్వెప్పుడు అంతే వాళ్ళ గొప్పేంటమ్మా! నేమాత్రం పొడుగులాగూ చొక్కా వేసుకోలా పరికిణీ వేసుకుంటే ఆడపిల్లకాని -

వాళ్లు కన్నుకొడితే మనకేం! మనం కొడదాం - వాళ్లు ఛాయ్! అని బెదిరిస్తే మనం బెదిరిద్దాం కావా లంటే నాన్నారి హంటర్ తెస్తాగా- నే వాళ్ళకి ఏం తీసిపొయ్యా నమ్మా' అని ఆరున్నొకటో రాగం లంకించుకునేది....

పసిదాని హఠం - తనతల్లి చెప్పే సూక్తిముక్తావళి వింటూన్న సుందర రామయ్యగారికి నవ్వొచ్చేది.

'అమ్మా! అవన్నీ యిప్పుడు దానికేం తెలుస్తాయమ్మా' అంటూ తేలిగ్గా నవ్వేసేవారు.

ఏడాదిపైన ఏడాది పడుతూ ఎదుగుతూవున్న సుగుణ బామ్మమాటల్లో అర్థం అవగతం చేసుకోనారంభించింది.

అమ్మలూ, ఆడదాని బతుకు అరిటాకు లాటిదమ్మా - అరిటాకు ముల్లు మీద పడ్డా, ముల్లు అరిటాకుమీద పడ్డా నష్టం అరిటాకుకేనే తల్లీ!

ఈ మాటలు యీడువస్తూన్న సుగుణపైన వేదమంత్రంలా పని చేశాయి.

స్కూల్లో ఆమె మగపిల్లలతో మాటాడేదికాదు. క్లాసులో ఆమె ఎక్కడవుండేదో ఎవరికీ తెలిసేది కాదు. మంచి మార్కులతో ప్యాసయి గ్రాడ్యుయేటు అయింది.

ఫ్యాక్టరీలో ఉద్యోగ మొచ్చింది. అక్కడ అనవసరంగా ఎవరితోను మాటాడేదికాదు. ఇంటికి వెళ్ల గానే వంట వార్పూ చూసుకోడం - వాళ్ళనాన్నగారితో కబుర్లుచెప్పడం యిది తప్ప వేరేలోకం ఎరగదు.

ఆమెకు, మగాళ్లంటే ఏదో భయం - కోపం మనసులో కదిలేవి.

మగవాళ్లు అలాటివారు అని వూహించుకునే సరికి ఆమెకు అసహ్యం ముంచుకొచ్చేది-

బామ్మ, వేదమంత్రం లాటి సూక్తులు సుగుణ పసిహృదయం పైన చెరగని ముద్రవేసినయి.

ఆ ముద్ర సడలకుండా వుండడమే కాకుండా - ఆ బీజం పెరిగి పెద్దదై అమ్మాయితో పెరిగిపోయింది. ఆ అనుమాన వృక్షాన్ని పెకలించి పారవేసేందుకు - సుగుణకు తల్లిలేకపోగా బామ్మకూడా కరువయింది.

* * *

నాగరాజు కూచున్నా, నిల్చున్నా, నిద్రలో, మెలకువలో కళ్ళఎదుట సుగుణ రూపమె అగుపడుతోంది. ఇంటికి రాగానే చంటి పిల్లాడిలా అమ్మనాన్నలకు కబుర్లు చెప్పేవాడిప్పుడు మాటలు వెతుక్కుంటున్నాడు. ఒదినతో చిట్టిపాపాయిలతో కథలు చెప్పేవాడు యిప్పుడు తప్పించుకు తిరుగుతున్నాడు.

రాత్రిళ్ళు కలల్లో ఏదో లోకంలో

తన ప్రేయసితో విహారిస్తున్నట్టూన్న వాడల్లా - కల కరిగిపోడంతో - తల పట్టుకు కూచుంటున్నాడు. ఒంటరిగా ఊహాలతో వూసులాడుతూండే వాడు.

ఆఫీసులో కూచుని ఒకరోజు విశ్రాంతి సమయంలో కాగితం కలం తీశాడు. మొదట కవిత్వం కలం దరికే చేరనన్నది. మెల్లగా బుజ్జగించి కావ్యకన్నెను కలంలో పొదిగాడు. తన మనసులోని మధుర భావాల్ని సిరాలో కలిపి రాయడం మొదలెట్టాడు.

సుగుణా!

ఈ వుత్తరం ఎలా మొదలెట్టాలో అర్థం కావడంలేదు. నాకు వర్ణించడం అట్టేరాదు. నే నేదన్నా రాయగలిగానూ- అంటే- అవి- నా మనసు చెబుతున్న మాటలు- నాలోని వాణి పాడుతూన్న పాట-

నినుతలుచుకుంటే- నమ్ము-రాణీ- నా గుండె వేయిగులాబీలు గుబాళించి నట్టవుతోంది. పున్నమిరేయి నన్ను గారడిచేస్తోంది- కాదు - ఆరడి చేస్తోంది. కలలముందునువ్వే-కనులు మూసినా తెరచినా నువ్వే.

సుగుణా- నీ చరణచారణ చక్రవర్తిని నేను.

సుగుణాల ప్రోవువు నువ్వు. అందుకేసార్థకనామధేయవు. కొందరి మగాళ్లలాగా నేను ఆడవాళ్లను-ఆట బొమ్మల్లాచూసే నీచుణ్ణికాదు-

నీ మనోభావాలు నాకు అర్థం కావు- నీ మొహంలో ఎట్టి హావభావాలు కన్పించవు- నువ్వెందుకు కనీసం మగజాతితో మాటన్నా మాటాడవో తెలీదు.

అంతేలే రాణీ- నా బాధ నీకర్థం కాదు-

అది నా దురదృష్టం-

మనసు మరగిపోతూన్న....

-రాజు.

లేఖ పదేపదే చదువుకున్నాడు. దాదాపు మననమే చేసుకున్నాడు. తలపయికెత్తి చూశాడు. గడియారపు పెద్దముల్లు, చిన్నముల్లు 12 అంకెదగ్గర కల్సుకున్నాయి. శుభసూచకమనుకున్నాడు. ఉత్తరాన్ని- చీటి మడిచినట్టు మడిచేశాడు. ఒక్కో సెక్షన్ని విజిట్కి- రౌండ్సులో బయలుదేరాడు-

కొంతదూరం వెళ్లాక ఆ చీటీని తన హృదయానికి దగ్గరగావున్న జేబులో పెట్టుకుని నడవసాగాడు. సుగుణే అంతచేరువగా వున్నట్టు వూహించుకుంటూ జేబుమీద నే చెయ్యివుంచుకుని అంగలు వేసుకుంటూహాయిందాగాసాగుతున్నాడు.

సుగుణ సెక్షన్ వచ్చింది. నడక జోరు తగ్గించి అడుగులో అడుగు

వేసుకుంటూ నింపాదిగా కదులుతున్నాడు. చీటీతీసి చదువుతూండగా—ప్యూన్ పరుగెత్తుకుంటూవచ్చి—మేనేజింగ్ డైరక్టర్ అర్జంటుగా రమ్మన్నారని చెప్పాడు.

హడావిడిలో కాయితం మడిచి జేబులో పెట్టేసుకుని గబగబా వెళ్లిపోయాడు నాగరాజు. ఆ చీటీ— చేరవలసిన గమ్యం వేరే వుందన్నట్టు అతని జేబులో చేరకుండా నేలమీద పడింది— ఫాన్ వుణ్యమా అని గాలి దేవుడు చల్లచల్లగా మెల్లమెల్లగా సుగుణసీటుదగ్గరకు చేర్చి తనబాధ్యత నెరవేర్చుకున్నాడు— వార్తా వాహకుడులాగా !

కొంతసేపటికి సుగుణ తన బల్లమీంది కాగితం కిందికి జారిందేమోనని ఆ చీటీ చేతుల్లోకి తీసుకుని చదవసాగింది.

ఆమె నిలువెల్లా కంపించిపోయింది — కంపరమెత్తింది—కళ్లలో నీళ్ళు సుడులు తిరిగినై....

'ఈ మగవాళ్ళు ఎంతకన్నా తగుదురు — చచ్చి స్వర్గంలోవున్న బామ్మ చెప్పిన మాటలకు సాక్ష్యం యిస్తోంది చీటి' అనుకుంది....

'హు — యిలా వదిలేయకూడదితణ్ణి — తగినశాస్తి చెయ్యాలి' అనుకుంది .... ఉక్రోషంతో బిగుసుకుపోతూన్న ఆమె మనసు — చదునే శంకించింది.

ఈ కాగితం తనకెలా వచ్చిందీ ఆలోచించనీయలేదు, భయ ఆందోళనా పూరితమయిన ఆమెమనస్సు.... ఓ క్షణం ఆలోచించినా — ఎలా అయితే నాకెందుకూ? అతడి సంతకముందిగా—అది అతడి దస్తూరే— అని,

మనసు కుదుటపరుచుకుంది— చీటీ పదిలం చేసింది. గుండె దిటవు చేసుకుంది—

చకచక మేనేజింగ్ డైరెక్టరు గది వయిపు నడిచింది. తలుపు దగ్గర కూచున్న బంట్రోతు పర్మిషన్‌తో, స్ప్రింగ్ డోర్ తీసుకుని తూటాలా లోపలికెళ్ళి, ఆఫీసరుగారికి నమస్కరించింది....

'ఏవిటమ్మా, సుగుణా' అన్నారు ఆఫీసరుగారు.

ఆమె గొంతు వణికింది. నోటి నుంచి మాట రాలేదు. కాలికింద నేల కదలినట్టయింది — ఒణికే చేతులతో నలిగిపోయిన ఆ చీటీ— ఆఫీసర్ ముందువుంచి....

సర్ ! ఆ మిలిటరీ ఆఫీసర్ ప్రవర్తనేమీ బాగాలేదు అని గాద్గదికంగా అనగలిగింది....

అంతే !

'నువ్వు వెళ్లవచ్చు' అన్నారు. గంభీర వదనంతో ఆఫీసర్‌గారు— కాగితం అందుకుంటూ—

ఉబికివస్తూన్న కన్నీరు ఆపు

కుంటూ, అదిరిపడే గుండెను అణచి పట్టుకుని గది అవతలికి నడిచింది బేలగా సుగుణ.

వెడుతూ- సీటులో- హుషారుగా ఊహాలోకంలో తేలిపోతూ- నవ్వు ముఖంతో కూచున్న నాగరాజుని చూసి లేడికూనలా బెదిరిపోయింది- సుగుణ.

రుసరుసలాడుతూ వెళ్ళిపోయింది- మిన్నాగులా - మిలమిల లాడుతూ కదిలిపోయే ఆమెవైపే చూస్తూన్న - నాగరాజు,

'సార్ - అయ్యగారు రమ్మంటున్నారు' అన్న జవాను మాటలకు మళ్ళీ యీ లోకంలో పడ్డాడు.

'ఎందుకు చెప్మా' అన్నట్టు చూశాడు.

ఇప్పుడేగా పిలిచి డ్రాఫ్ట్ ఇస్తూ - మొదటినెలకనక - కాస్త డిలేఅయింది పేమెంట్ అన్నాడు ప్రసన్న వదనంతో -

'మళ్ళీ.... ఎందుకు పిలిచారో?' అనుకుంటూ జవాను వెనకాలే వెళ్ళాడు. లోపల అడుగు పెట్టిన నాగరాజుకి,

ఆఫీసరు బుస్సులు కొట్టి కాటు అందుకునే కోడె త్రాచులా కనబడ్డాడు.

ఆఫీసరు వెంటనే,

'ఊ-ఎం, మిస్టర్ నాగరాజు, నెలజీతం అందుకోకుండానే పెద్ద హీరో అయ్యావన్న మాట.

ఇదేనా మొదటి వార్నింగ్- ఈ ఫ్యాక్టరీలో చాలామంది ఆడపిల్లలు పని చేస్తున్నారు.'

'అయితే'అన్నట్టు ప్రశ్నార్థకంగా నాగరాజు....

అదే! లేడీ - స్టాఫ్ విషయంలో ఒళ్ళు దగ్గరగాఅట్టె పెట్టుకుమనలాలి.

'ఇక నడవండి'

అని హుందాగా ముగించాడు. సెల్యూట్ కొట్టి, ఒక్క అడుగువేసి, వెను దిరిగి, వెళ్ళిపోయాడు నాగరాజు.

* * *

ఈ రగడ జరిగిన నెల తిరక్కుండానే నాన్నగారు తన పాత స్నేహితు డింటికి పెళ్ళిచూపుల కంటూ తీసికెళ్ళారు - తీరాచూస్తే-

ఆ యిల్లు, తన ప్రేమను రచ్చ కీడ్చిన రమణిది.... పెళ్ళిచూపులలో కనిపించిందే ఆమె .... అతనికి నఖశిఖ పర్యంతము భగ్గుమంది .... తేళ్ళూ, జెర్రులూ పాకినట్టయింది. ముళ్ళమీద నిలబడ్డట్టు కూచున్నాడు. ఎవరికీ వినబడకుండా పళ్ళు కొరుక్కున్నాడు, ఆమె నిశ్చలంగా మౌనంగా, ఠీవిగా కూచుంది....

ఆ ప్రవర్తన, అతనికి అగ్గిమీద గుగ్గిలమే అయింది. నదురు, బెదురు లేకుండా ఏమీ జరగనట్టు,

'హు .... ఏమీ ఎరుగనట్టు, కూచుంది_

పైగా, నాన్నగారు క్షమాపణగా వారిచ్చే కట్నంకూడా వద్దంటున్నారు.

అబ్బ - ఈ పెద్దవాళ్లున్నారే వీళ్ళు అనుకూల శత్రువులు. ఏవిట్రా అబ్బాయి ఏవంటావ్ - అని ఒక్క మాట అడక్కుండా గ్రాండ్‌ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌లా నాన్‌స్టాప్ గా మాట్లాడుతున్నాడు నాన్న'- అనుకుంటూ ఎటోచూస్తు - కూచున్నాడు.

పెద్దవాళ్ళిద్దరూ కబుర్లలో పడడంతో,

నాగరాజు కాఫీ త్రాగకపోవడం గమనించలేదు....

'అమ్మ కాబోయే కోడలు అపర సుందరి, అతిగుణవతి అని పొంగిపోతూ ఆ అమ్మాయితో కబుర్లలో పడిపోయింది.

ఇంటికొచ్చాక అమ్మా నాన్నా, అమ్మాయి అందచందాలు, వంశము, వారి పూర్వచరిత్ర తలచి తలచి మురిసిపోయారేగాని పన్ను విప్పి పిల్లాడి యిష్టం అడగలేదు.

ఇంతట్లో పాడుమృత్యువు వెంకట్రామయ్యను నెలతిరక్కుండా వెదుక్కుంటూ వచ్చి వెంట తీసుకుపోయింది....

'నాన్నగారు కన్నుమూస్తూ, అన్ని అప్పగింతలతోపాటు-

నాయనా! సుందరరామయ్య నేను ఆయన మారుటితల్లి చల్లని చేతుల్లో పెరిగాం- వాడు బ్రాహ్మల యింటి సంపన్నుల బిడ్డడని - నే పెద్ద కాపు బిడ్డడిననే తేడాపాడాలు లేవు. ఆ యింట్లో - ఓ కంచంలో తిని ఓ మంచంమీద పడుకునే స్నేహం మాది- ఆయన రాజకీయాల్లో తిరిగి జైళ్ళపాలయి సిరిసంపదలు హారతి కర్పూరం కాగా - భార్య కృశించి చనిపోగా - యీ బిడ్డే తన సర్వంగా మిగుల్చుకున్నాడు.... పాపం?- అని ఆయానపడుతూ-

అమ్మ - మమ్మల్ని-

ఒరేవ్! మీరు బావా, బావా అంటూ ఇంచక్కా ఒకళ్లనొకళ్లు పిల్చుకోండిరా_

వెంకడికొచ్చే పెళ్లాం - నన్ను అమ్మా అంటుంది? అనేది_

ఆ అమాయకురాలికి - తల్లి కాని తనకి - ఓ కొడుకున్నాడు - ఓ కూతురు కావాలి! అంతే!

కాని - యిలా మేం వియ్యం నిజంగానే అందుతామనుకుని వుండదు.

కాని ఆమె దీవెనలు నిజమవుతాయని ఆశించి - అవి ఫలించకుండా వెళ్ళిపోతున్నా....

వాడు - స్వతంత్ర సమరవీరుడు ఏవో తామ్రపత్ర బహుమతి నందుకుందుకు వెళ్ళాట్ట_

కడచూపు లేకుండా వెళ్ళిపోతున్నా' అని వెక్కిళ్ళతో యింకా ఏదో అనబోతూ_

'నే జబాబు చెప్పేలోగా _ మమ్మల్ని దుఃఖంలో ముంచి చల్లగా వెళ్ళిపోయారు.

నాగరాజు వీలయినంతవరకు ఆమెను తప్పించుకు తిరుగుతున్నాడు.

కాలచక్రం గిర్రున తిరిగిపోతోంది. కాలానికి ముందుచూపే గాని వెనకచూపులేదు. సంవత్సర కాలం దొర్లింది. వెంకట్రావుగారి సంవత్సరీకాలు కూడా అయిపోయినవి. ఆయన పటానికి పూలదండ వేస్తూన్న నాగరాజుకి - పటంలోని తండ్రి కళ్ళంట నీరుకారుస్తూన్నట్టే కన్పించి కలవరపడ్డాడు.

నాయనా! నాముచ్చట తీర్చవా? అన్నట్టు వర్ణించే తండ్రి కళ్ళు చూసి కంపించిపోయాడు.

ఏమీ తోచని అస్తవ్యస్తంలో పడ్డాడు, నాగరాజు.

అతని పెళ్ళివిషయం_తల్లి _ ఏమీ తరచి అడగడంలేదు.

• • •

ఆవేళ సోమవారం - సుమతి ఆఫీసుకి వెళ్ళింది_సుందరరామయ్యగారు మధ్యాహ్నం రెండు గంటలవేళ నాగరాజు యింటికి వెళ్ళాడు.

సుశీలమ్మ రుక్మిణీకళ్యాణం చదివి యిరుగుపొరుగు అమ్మలక్కలకు విడమర్చి అర్థం చెబుతూన్నది.

ఆ ఇంటి పెద్ద కోడలు సుందరి పొగడచెట్టుకింద కూచుని పదిమంది పిల్లలకు హిందీపాఠాలు చెబుతోంది.

గుమ్మంలో కాలు పెడుతూన్న సుందర రామయ్యను చూసి, సుశీలమ్మ కళ్ళజోడు సవరించుకుని, 'అన్నయ్యగారా? రండి _ రండి' అన్నది. సుందరి చెంబెడు చల్లని మంచినీళ్ళు అందించింది_'బాబాయిగారూ' అంటూ ఎంతో ఆదరించి కాఫీ, ఫలహారాలందించింది.

ఆ ఆదరణకు ఎంతోమురిసిపోతూ ఆయింటో ఆఅనురాగమయికోడలుగా అమృత హృదయి తోడికోడలుగా వూహించుకున్నాడు తన కూతుర్ని ఓ క్షణం వుక్కిరిబిక్కిరే అయ్యాడు. మరుక్షణం ఎంతో ఆశ నిండిన గొంతుతో 'అమ్మా చెల్లెమ్మా' అన్నాడు, సుశీలమ్మ నుద్దేశించి,

ఆమె బాధ నిండిన గుండెతో 'అన్నయ్యా, నన్నేం చేయమంటావ్? వాడిమనసులో మాట చెప్పడు _ నన్నిలా వేధిస్తున్నాడు_ నన్ను క్షమించండి అన్నయ్యగారూ' అన్నది.

అడుగులక్రింది భూమి తొలగినట్టయిన సుందరరామయ్యగారు, కాలు తొట్రుపడుతూండగా యింటికి దారి తీశాడు. నాగరాజు ఇంటికి వెళ్ళి

తానెందుకు వెళ్ళిందీ చెప్పకపోయినా వెళ్ళినట్టుమాత్రం చెప్పి- నిర్విణ్ణవదనంతో నిట్టూరుస్తూ ఉండిపోయాడు.

• • •

తండ్రిని చూచి లోలోనే బాధపడి వూరుకున్న దేగాని పన్ను కదపలేదు సుగుణ.

ఆ మౌనానికి మరింత బాధపడ్డాడు తండ్రి.

ఆ రాత్రి సుగుణకి నిద్రలేదు. ఆలోచనలు సుడులు తిరుగుతూ ఆమె బుర్రను వేడెక్కించాయి. ఏణ్ణర్థం వెనక్కి నడిచింది ఆమె మనసు_కాని అక్కడ నిలవలేదు. 20 ఏళ్ళు వెనక్కి పరుగెత్తింది....

'అన్ని తిన్నగావుండే ఆడదాని జీవితానికేం, మూడు పువ్వులూ ఆరుకాయలూ' అనేది బామ్మ.

మళ్ళీ ఆ బామ్మే

'ఆడదాని బ్రతుకు అధమస్తమమ్మా,

ఆడదయి పుట్టడంకంటే అడవిలో చెట్టయి పుట్టడం మంచిది' అంటూండేది _ అంతా విడమరచి చెప్పినట్టూ లేదు _ చెప్పినా నాకు తెలిసేయీడూ కాదు_

తెలునుకునేంత దాన్ని అయ్యేవరకు బామ్మ లేనూలేదు....

ఏవిటో యిలా తెలిసీ తెలీని వూహాలతో ఆడమగ కలిసి బ్రతికే అవసరంలేదనే అహం ఏదో నన్నావరించింది. అందుకే మగాళ్ళకు దూరదూరంగా బ్రతకడానికి అలవడ్డాను _ జడపదార్థంలానే వుండిపోయాను.

అవును....ఆ....య....న ఉత్తరం నాలో చైతన్యాన్ని నింపింది. ఏదో తీయని, తీరనిబాధ కాని చేజేతులా జారవిడుచుకున్నాను....

మందబుద్ధినై....

చేజిక్కిన పెన్నిధిని.

పెళ్ళిచూపుల్లో అపూర్వపుఘట్టం_ నన్ను బిగుసుకు పోయేలా చేసింది_ ఆయనవైపు కన్నెత్తి చూడలేకపోయాను. ఇంత జరిగాక ఆయన నన్నెలా క్షమిస్తారు? వారి కక్ష నాకు శిక్షయి కూచుంది.

శిలలాటి నా మనసు మారేసరికి వారు శిల్పంగా మారారు. అది నా దౌర్భాగ్యం' అనుకుంటూ ఎప్పుడు కునుకు పట్టిందో ఆమెకే తెలీదు. ఉదయమే లేచి పనులన్నీ చేసుకుని ఆఫీసుకి వెడుతూ 'నాన్నా! ఈవేళ ఆఫీసుపని ఎక్కువగా వుంటుంది_ కాస్త ఆలస్యమైతే కంగారుపడకు నాన్నా' అంటూ వెనుదిరిగి చూస్తూ వెళ్ళింది. ఆవేళంతా పరధ్యానంగానే గడిపింది సుగుణ. ఎంత మనస్సు చిక్కబట్టుకున్నా మనసనే గుఱ్ఱం ఆగటంలేదు. గతజీవితమంతా సినీరీళ్ళలా తిరుగుతూంది. బామ్మ




మాటలు చెవుల్లో రివ్వుమంటున్నాయి. నాగరాజు వుత్తరంలోని మాటలు ఎదరనుంచుని నాట్యమాడుతూ వెక్కిరిస్తున్నాయి. లోలోన తీరని వ్యధ.... మనసంతా అశాంతి అలుముకుంది.

ఫయిల్సు గబగబ తిరగేసింది – తలనొప్పితో బాధపడ్తూ కణతలు పట్టుకూర్చుంది. ఎదురు సీట్లలో ఫణి, భుజంగం యీమెను కన్నెత్తి చూడని కన్యగా, పన్నెత్తి పల్కని పడతిగానే ఎరుగుదురుగాని, ఈనాటి యీ తరుణి తొట్రుపాటు ఏమో వూహించలేకపోయి, అయినా ధైర్యం లేక చేసేదిలేక వూరుకున్నారు.

ఆవేళ ఆమె ధ్యాసంతా అయిదింటిమీదికి చిన్నముల్లు చేరుకోవాలని – ఎప్పుడు చేరుతుందా అనిన్నీ! అయిదు కాగానే అంగడి కట్టేసి సీటులోనించి లేచి బస్సుస్టాండువయిపు నడిచింది.

నాగరాజు ఎక్కిన బస్సే తనూ ఎక్కింది. అతడు దిగినచోటే తనూ దిగి – అతను తెలీకండానే వెంటనడిచింది. అతడు బీచిలోకి నడిచాడు. సముద్రతీరాన్ని చేరి ఆ అలలను చూస్తూ – ఆ ఘోషతో తన గోడును కలుపుతూ – దినచర్యగా గడుపుతున్నాడు. అది అతనికి కొత్త కాదు – ఏడాదినుంచి యిలా సముద్రుడే వింటున్నాడు అతనిగోల – కాస్సేపు అలానుంచున్న రాజు వెనక్కి నడిచి యిసుకలో కూచున్నాడు. ఆ కాళ

వీధిలో బాలచంద్రుడు ఫక్కున నవ్వుతున్నట్టనిపించి— తన చేతులతో పట్టుకుని మోకాళ్లమీద తలఆన్చి కూచున్నాడు. సుగుణ దగ్గరగా వచ్చి నుంచుని 'ఏవండీ, అంత పరధ్యానంలో వున్నారు, అదేవిటో తెలుసుకోవచ్చా' అంది—

పుదయాన్నించి— కాదు— రాత్రినించి కూడగట్టుకున్న ధయిర్యంతో— యీమాటలుపఠించి, బాగాగుర్తుంచుకుంది—

ఆ పాఠమే వప్పగించింది—

ఎక్కడో విన్న, వింటున్న పరిచిత కంఠమది— 'ఎవరూ?' అంటూ కలయేచూచిన అతనికి ఎక్కడో కాదు, పక్కనే,

తను అసహ్యించుకునే అపరంజి బొమ్మ కనబడింది. చిరాకుతో ఆమె వయిపుజూచి, కోపంగా లేవబోయాడు అదరిపడుతున్న గుండెను గట్టి చేసుకుని,

అతని చేయిపట్టుకుని ఆపేసింది....

ఆ పక్కగానే కూచున్న కొన్ని జంటల కళ్లు వీరివయిపుతిరిగాయి....

వాళ్లు వినేలాఏవిటండీ! మీ పట్టుదల మీదేనా? అంది చిరపరిచితురాలులాగా....

ఆ జంటలు — ఆ ఏదో పాత పరిచితులే అని సరిబుచ్చుకుని కళ్లు తిప్పుకున్నారు.

'చాలా, థ్యాంక్స్ అండీ— బుద్ధిమంతుడిలాగా, కూచోడంతో వాళ్లంతా మనవయిపుచూడ్డం మానేశారు. 'నేను బుద్ధిమంతుణ్ణి ఎలా అవుతానా? బుద్ధిలేనివాణ్ణి— కనకనే— అంటూండగా

'ఉష్! దయచేసి అలా అనకండి అని ఆమె తన చూపుడివేలు అతని నోటిదగ్గర వుంచబోతూ— ఆగిపోయి— ఆ రెంటోమాట నాకే అన్వయిస్తుంది— అన్నది.

నా మనసువిప్పి మీ ముందు పదిలంగా వుంచుతున్నాను— అలకమాని ఆదరిస్తారో— పో పొమ్మని కసరికొడతారో మీరె నిర్ణయించండి—

చిన్నప్పుడే తల్లిప్రేమ కరువయింది నాకు—

అడపాతడపా బామ్మయింటి కెళ్ళేదాన్ని. ఆమె నా పసి మనసుపయి అమాయికంగావేసిన ముద్ర ఫలితం— నేను అందరితో ముభావంగా, మగవారితో మరీ అంటీ ముట్టకుండా పుండడం అలవాటు చేసుకున్నా! ఆ ఆలోచనాస్రవంతి అవధులుమించి ప్రవహించిది నాలో....

అందుకే— ఆ రోజున— ఆ— మీ లేఖను చూడగానే తారాజువ్వలా లేచాను. పరిచయం లేనివ్యక్తితో లేఖద్వారా పరాచికాలాడితే పరుషంగా మాటాడేను గాని యిలా

మీరే నా పతిగా పెద్దలచేనిర్ణయింప బడి మీ చేతనే పరాభవింప బడతా ననుకోలేదు.

పెళ్ళిచూపులకు వచ్చినప్పుడు మిమ్మల్ని చూసి గతుక్కుమన్నాను. నా చేత అవమానింప బడినవారు నా కాబోయే శ్రీవారు అంటూ నాకళ్ళు మెదడుకీ అందిచేసరికి_ అది మొద్దు బారింది_ కళ్ళుపయికి లేవనన్నాయి_ బిగునుకుపోయి, బిక్కచచ్చి కూచు న్నాను. మీ అమ్మగారేమడిగారో నేనేమి చెప్పానో తర్వాత మానాన్న అడిగితే మౌనం వహించాను_ గుర్తు లేక.

'ఇదీ పరిస్థితి_ ఇప్పుడు చెప్పండి'

అంతేకాదు_

ఆ నాడు ఆ వుత్తరం చేసినరభస యిలా రసాభాసం చేస్తోంది_ఒప్పు కున్నాను.

కాని అదేలేఖను_నేను చడీచప్పుడు లేకుండాజాగ్రత పెట్టుకుని, మీ లీల లకు దోహదమిచ్చివుంటే............

ఆనాడు, అకస్మాత్తుగా పెద్ధల సమక్షంలో నన్ను చూచిన మీకు ఏవగింపు కలిగేదికాదా ? ఎంత మంది లేఖలు అందుకున్నానోనని ? మీరలా అనుకోరనుకుందుకు అధార మేమిటి ? చెప్పండి !

మాటాడరేం ?

అందుకే మాబామ్మమాట 'ఆడది అరిటాకులాటిదన్నమాట, అక్షరాల పచ్చినిజం'

నాకు తెలుసు_ఒకే పక్క ఆలోచి స్తూన్న మీమనసు నడగండి_నా తప్పు ఒప్పు ఎందుకు కాకూడదని విన్నవించుకుంటున్నాను. క్షమించ మని ప్రార్థిస్తూన్నాను మీ హృద యంలో యింతచోటివ్వమని అర్థించి కన్పించని మీనాన్నకు ఆత్మశాంతి, కన్పించే మాఅమ్మ, మానాన్నలకు మనశ్శాంతి కల్పించాలని, గుండె గట్టిచేసుకుని యిలా ఒంటరిగా వచ్చాను,

ఇక శలవిప్పించండి....

అంటూ లేచి

నాలుగడుగులేసింది .... ....

సుగుణా_అంటూ గట్టిగా జీలుస్తూ...

లేచి.... .... వెళ్లి .... ....

సుగుణ కుడిచేతి చిటినవ్రేలు తన ఎడమచేతి చిటినవ్రేలితో పెనవేసి దీవించమన్నట్టు ఆకసంలో చంద్రుని వయిపుచూస్తూ - ఒకటి, రెండు, మూడు అంటూ ఏడడుగులు నడి చారు. పద ! ఇద్దరంకలిసి పెద్దళ ఆశీస్సులు పొందుదాం అంటున్న రాజు కళ్లల్లో, చల్లని వెన్నెల వెలు గులో తన బింబాన్నితృప్తిగాచూచు కుంది సుగుణ. ★